క్లుప్తంగా

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక దిబ్బలపాలెంలోని గ్రంథాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారామ, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు స్వామి, అమ్మవార్లకు మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. చివరి రోజు ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

ఘనంగా నూకాలమ్మతల్లి గరగల సంబరం



అన్నవరంలో నూకాలమ్మతల్లి గరగలను ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: గ్రామంలో నూకాలమ్మతల్లి గరగల సంబరం శనివారం ఘనంగా జరిగింది. ఏటా కొత్త అమావాస్య రోజున మండపం గ్రామంలో కొలువైన నూకాలమ్మతల్లి జాతర నిర్వహిస్తారు. జాతరకు వారం లేదా పది రోజుల ముందు మండపం గ్రామం నుంచి నూకాలమ్మతల్లి గరగలను ఊరేగింపుగా అన్నవరం తీసుకువచ్చి గ్రామంలో ఊరేగించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా శనివారం అన్నవరం వచ్చిన గరగలకు గ్రామస్తులు స్థానిక యూనియన్ బ్యాంక్ సెంటర్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గరగలను గ్రామంలో ఊరేగించారు. రాత్రికి పెదరావిచెట్టు వద్ద గరగల సంబరం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి గరగలను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

49 మందికి వైద్య పరీక్షలు



తుని గణపతి నగర్ పార్కు వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

తుని: స్థానిక పొట్టి శ్రీరాములు గణపతి నగర్ పార్కులో శనివారం మధుమేహ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తుని వాకర్స్ హెల్త్‌క్లబ్ ఉపాధ్యక్షుడు కందవల్లి జోసెఫ్ తెలిపారు. తొలుత వైద్య శిబిరాన్ని వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ చదరం శివాజీ ప్రారంభించారు. వైద్యుడు సూర్యనారాయణ, మారుతి దయాగ్నోస్టిక్స్ ప్రతినిధి ప్రసాద్ 49 మందికి షుగర్, బీపీ పరీక్షలు చేశారు. ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వాకర్స్ హెల్త్‌క్లబ్ జిల్లా కార్యదర్శి కుందెం సత్యనారాయణ, సభ్యులు పర్వత బాబూరావు, వి.గోవిందబాబు, పి.శివ, వెంకటసుబ్బారావు, ఎంబీ కృష్ణమూర్తి, జి.వేణు గోపాలస్వామి, ఎం.వాసుదేవరావు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు



నారాయణను సన్మానిస్తున్న డీఎం సత్యనారాయణ, తదితరులు

ఏలేశ్వరం: ఉద్యోగులు తమ సేవల ద్వారానే ప్రత్యేక గుర్తింపు పొందుతారని ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేసిన ఎస్ఎస్ నారాయణ ఉద్యోగ విరమణ చేయడంతో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం సత్యనారాయణ మాట్లాడుతూ నారాయణ తన 36 ఏళ్ల సర్వీసులో ఏనాడు సిక్ లీవ్ పెట్టి విధులకు గైర్హాజరు కాలేదన్నారు. నారాయణను ప్రతి ఉద్యోగి స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు యూబీఎం కుమార్, కె.త్రిమూర్తులు, కార్యాలయ సిబ్బంది చంద్రశేఖర్, ఏఏ రాజు, జీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జీయన్న మఠంలో ప్రత్యేక పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జీయన్న మఠంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామివారికి విశేష పూజలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దశాబ్దాల కల సాకారం

- రూ.10 కోట్లతో తాండవ నదిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం
- శరవేగంగా జరుగుతున్న పనులు
- నాలుగు నెలల్లో అందుబాటులోకి రానున్న బ్రిడ్జి
- తీరనున్న 50 గ్రామాల ప్రజల కష్టాలు



తుపాను సమయంలో కాజ్‌వే పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

కోటనందూరు: స్థానిక ప్రజల ఐదు దశాబ్దాల కల సాకారమైంది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా చొరవతో కోటనందూరులో తాండవ నదిపై ఉన్న కాజ్ వేను హైలెవెల్ బ్రిడ్జిగా అభివృద్ధి చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులను మంజూరు చేసింది. ప్రస్తుతం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో నాలుగు నెలల్లో బ్రిడ్జి అందుబాటులోకి రానున్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే సుమారు 50 గ్రామాల ప్రజలకు ప్రయాణ అవస్థలు తీరడంతో పాటు ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి దాడిశెట్టి రాజా చేసిన కృషి పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

1976లో కాజ్ వే నిర్మాణం

తుని-నర్సీపట్నం రోడ్డు నుంచి కోటనందూరు గ్రామానికి చేరుకోవాలంటే మధ్యలో ఉన్న తాండవ నదిని దాటాల్సి ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రయాణికులు సాధారణ రోజుల్లో నదిలోకి దిగి రాకపోకలు సాగిస్తుండేవారు. వరదల సమయంలో తెప్పల సహాయంతో నదిని దాటి గమ్యాలకు చేరుకునేవారు. ఈ పరిస్థితి అప్పట్లో రైతులతో పాటు ప్రయాణికులను చాలా ఇబ్బందులకు గురి చేసేది. అప్పటి పాలకులు, రైతుల ఆర్థిక భాగస్వామ్యంతో ప్రభుత్వం రూ.13 లక్షలు ఖర్చు చేసి 1976లో తాండవ నదిపై కాజ్‌వే నిర్మించింది. అప్పటి ప్రజల అవసరాలు, రోడ్ల పరిస్థితులకు అనుగుణంగా నిర్మించిన ఈ కాజ్‌వే ఆనాటి ప్రజల ఇబ్బందులను తొలగించింది. కాలక్రమంలో ఈ కాజ్‌వే శిథిలం కావడం, కాజ్ వేకు ఇరువైపులా రక్షణ లేకపోవడం, ఎత్తు, వెడల్పు, కింద పిల్లర్ల మధ్య దూరం తక్కువగా ఉండడం వంటి కారణాలతో ఇప్పటి ప్రజలకు మళ్లీ అవస్థలు తప్పడం లేదు. వరదల సమయంలో నదిలో నీరు కాజ్‌వే పైనుంచి ఉధృతంగా ప్రవహించడంతో తుని-నర్సీపట్నం రోడ్డుకు, కోటనందూరు గ్రామానికి పూర్తిగా సంబంధాలు తెగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కాజ్‌వేను బ్రిడ్జిగా అభివృద్ధి చేయాలని గత నాలుగు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కోటనందూరులో తాండవ నదిపై శిథిలావస్థకు చేరిన కాజ్‌వే



చురుగ్గా జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

మంత్రి దాడిశెట్టి రాజా చొరవతో...

మండలంలోని కేఈ చిన్నయ్యపాలెం, పాతకొట్టాం, కొత్తకొట్టాం, ఎల్లీపేట, కోటనందూరు గ్రామాలతో పాటు రౌతులపూడి, శంఖవరం, అనకాపల్లి జిల్లా నాతవరం మండలాల్లోని 50 గ్రామాల ప్రజలు తుని-నర్సీపట్నం రోడ్డుకు చేరుకునేందుకు తాండవ కాజ్‌వే గుండా రాకపోకలు సాగిస్తుంటారు. తుపానుల సమయంలో తాండవ నదిలోని వరద నీరు బ్రిడ్జిపై నుంచి ప్రవహించి రాకపోకలు స్తంభించిపోవడంతో పాటు నది పరివాహక ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి. సమస్యను స్థానికులు మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి రాజా సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వివరించడంతో సీఎం ఆదేశాల మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

అన్ని రకాలుగా అభివృద్ధి

కోటనందూరులో తాండవ నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలతో పాటు ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. కోటనందూరులోని తుని-నర్సీపట్నం రోడ్డు నుంచి పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం, రౌతులపూడి, శంఖవరం మీదుగా కత్తిపూడి వద్ద 216 నంబరు హైవేకు చేరుకునేందుకు 33 కిలో మీటర్ల పొడవ గల రోడ్డు ఉంది. కాగా కోటనందూరులో తాండవ నదిపై సరైన బ్రిడ్జి లేకపోవడంతో ఈ మార్గంలో భారీ వాహనాలు తిరిగే అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా ఈ రోడ్డు లూప్‌లైన్‌గానే మిగిలిపోయింది. ఇక్కడ ఉన్న కాజ్‌వే బ్రిడ్జిగా అభివృద్ధి చెందితే సౌకర్యవంతమైన ప్రయాణంతో పాటు ఈ ప్రాంతం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతుంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

ఆనందంగా ఉంది



తాండవ నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలతో పాటు ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది. వరదలు, అత్యవసర సమయాల్లో సైతం ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుంది. ఈ ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా బ్రిడ్జి నిర్మించాలని డిమాండు చేస్తున్నా.. గత పాలకులు పట్టించుకోలేదు. ఇప్పుడు బ్రిడ్జి అభివృద్ధికి నోచుకోవడంతో ఆనందంగా ఉంది.

– వాదపర్తి సుబ్బు, కోటనందూరు

సత్యదేవుని దర్శించిన రాష్ట్ర సమాచార కమిషనర్



సత్యదేవుని సన్నిధిలో వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న సమాచార కమిషనర్ రాజా దంపతులు

అన్నవరం: రాష్ట్ర సమాచార కమిషనర్ ఐలాపురపు రాజా శనివారం కుటుంబ సభ్యులతో కలిసి రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం పండితులు వారికి వేదాశీస్సులు అందజేసి స్వామివారి ప్రసాదాలను బహూకరించారు. వారి వెంట దేవస్థానం ఆర్ఐ ప్రసాద్ ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

తొండంగి: మండలంలోని దానవాయిపేటలో వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ పండితులు అగ్నిహోత్రం రంగాచార్యులు, శుంకరణం వెంకటరాజుశర్మ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఆశీనులను చేసి వేదమంత్రాలు, బాజాభజంత్రీల నడుమ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

జగన్ పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి



పైడికొండలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి, తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- పైడికొండలో ఎన్నికల ప్రచారం

తొండంగి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయనను గెలిపించి మరింత సంక్షేమాభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని పైడికొండలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. తొలుత గ్రామంలోని అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళర్పించారు. అనంతరం బీసీ కాలనీ, ఓసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలతో పాటు డ్వాక్రారుణాల మాఫీ, వైఎస్సార్ ఆసరా, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర పథకాల ద్వారా ఇంటింటికీ లబ్ధిని చేకూర్చారన్నారు. మీకు మంచి జరిగితే వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. స్థానిక ప్రజలు కోరిక మేరకు గ్రామంలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

వైఎస్సార్ సీపీలో 50 మంది చేరిక

ఆనూరుకు చెందిన 50 మంది టీడీపీ కార్యకర్తలు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. యాదవ సంఘం నాయకులు నక్కా దేవుళ్లు, నక్కా చంటిబాబు, పల్లా రాంబాబు మంత్రి దాడిశెట్టి రాజా సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. అలాగే పైడికొండలో మేడిశెట్టి సత్తిబాబుతో పాటు మరికొంత మంది వైఎస్సార్ సీపీ చేరారు. వీరికి మంత్రి రాజా పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం గంగబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, సర్పంచ్ నర్సే దుర్గ, పార్టీ నాయకులు నర్సే స్వామి, మేడిశెట్టి దారబాబు, ఎంపీటీసీ జక్కా అమ్మాజీ, జక్కా వరహాలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

ఏలేశ్వరం: సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి కోరారు. మండలంలోని లింగంపర్తిలో శనివారం సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి ఆటంకం లేకుండా గ్రామస్తులు సహకరించాలన్నారు. ఎవరైనా తగాదాలు సృష్టిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కోడ్ అమలులో ఉన్నప్పుడు కేసు నమోదు చేస్తే ప్రతి ఎన్నికల్లోనూ ఇబ్బందులు తప్పవన్నారు. పోలీసులు, అధికారులు ప్రజలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శేఖర్‌బాబు, ఎస్సై జి.సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.



లింగంపర్తి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ లతాకుమారి

• కూల్ ఈజ్ వెల్

- మండుతున్న ఎండలు
- చల్లదనం కోసం ప్రజల ఆపసోపాలు
- కూల్ డ్రింక్స్, చెరకు, పండ్ల రసాలకు పెరిగిన డిమాండ్
- కళకళలాడుతున్న సాగరతీరం

పిఠాపురం: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచే భానుడి తన ప్రతాపం చూపుతున్నాడు. ప్రజలు ఎండ వేడిమి నుంచి రక్షణ పొందడానికి ఆపసోపాలు పడుతున్నారు. తమకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను అనుసరిస్తున్నారు. ఎండలు మండుతున్నా భయటకు వెళ్లకతప్పని పరిస్థితుల్లో కంటికి, తలకు రక్షణ కవచాలు ధరించి ఇంటి నుంచి అడుగు బయట పెడుతున్నారు. ఎండ నుంచి రక్షణ చర్యల్లో భాగంగా కళ్లకు రక్షణగా చల్లదనాన్ని ఇచ్చే కళ్ల జోళ్లు, శరీరానికి చల్లదనాన్ని ఇచ్చే చెరకు, పండ్ల రసాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండడంతో వాటికి గిరాకీ పెరిగింది. ప్రతి గ్రామంలోనూ రోడ్లకు ఇరువైపులా కళ్లజోళ్లు, చెరకు, పండ్ల రసాల దుకాణాలు వెలిశాయి. రూ.100 నుంచి చలువ కళ్లద్దాలు లభ్యమవుతుండడంతో అందరు వాటిని కొనుగోలు చేసి ధరిస్తున్నారు. పనిలో పనిగా శరీరాన్ని ఉష్ణ తాపం నుంచి రక్షించుకోడానికి చల్లదనం కోసం ఆరోగ్యప్రదాయని అయిన చెరుకు రసం తాగుతున్నారు. ప్రయాణికులు తాము చెరకు రసం తాగడంతో పాటు బాటిళ్లలో ఇళ్లకు తీసుకువెళ్లడంతో అమ్మకాలు ఊపందుకున్నాయి. కాకినాడ జిల్లాలో పలు పంచదార పరిశ్రమలు మూత పడడంతో కేవలం రసం కోసమే చెరకు పండిస్తున్నారు. కొబ్బరి, ఖర్బూజా, పుచ్చ, బొప్పాయి, నారింజ, దానిమ్మ, బత్తాయి, ద్రాక్ష తదితర పళ్ల రసాలకు డిమాండ్ బాగా పెరిగింది. మరో పక్క శారీరక మానసిక ఉల్లాసం, చల్లదనం కోసం సాగరతీరానికి పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. దీంతో ప్రతిరోజూ సాగర తీరం యాత్రికులతో కళకళలాడుతోంది.



ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో చెరకు రసం అమ్మకాలు

సంక్షేమ సారథికి పట్టం కట్టండి

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- జె.అన్నవరంలో ఎన్నికల ప్రచారం



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మళ్లీ పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కోరారు. మండలంలోని జె.అన్నవరంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నిపార్టీలు కలిసి వచ్చిన వైఎస్సార్ సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. ప్రజల మద్దతు ఉన్న సీఎం జగన్ మళ్లీ గద్దె నెక్కడం ఖాయమన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీకి అవకాశం కల్పించి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అడపా పార్థసారథి, కొండపల్లి వెంకటేశ్వరరావు, కాలారి సత్తిబాబు, కాకరపల్లి వీరంశెట్టి, కోరాడ శ్రీను, సింగిరెడ్డి సోమన్నదొర, కొండపల్లి బాబీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 100 మంది చేరిక

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరం గ్రామానికి చెందిన సుమారు 100 మంది టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. ఎన్ని పార్టీలు కలిసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపాలేరన్నారు. సీఎం జగన్‌కు మళ్లీ పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిగాటపు సాంబయ్య, జిగాటపు గంగ, సమ్మిట రాంబాబు, కొండపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జె.అన్నవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

మాదిగ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పెద్దిరాజు



పెద్దిరాజు (ఫైల్)

గోకవరం: మాదిగ వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన కండెల్ల పెద్దిరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఇటీవల జగ్గంపేటలో జరిగిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమావేశంలో ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు మాదిగలకు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేస్తానన్నారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు, ఎంపీపీ సుంకర శ్రీవల్లి, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, నాయకులు సుంకర వీరబాబు, సమ్మెటి నాని తదితరులు పెద్దిరాజును అభినందించారు.

కాంగ్రెస్‌కు ఐటీ నోటీసులు దారుణం

ప్రత్తిపాడు రూరల్: కాంగ్రెస్ పార్టీకి రూ.1823 కోట్లు కట్టాలంటూ ఐటీ శాఖ నోటీసులు జారీ చేయడం దారుణమని ఆ పార్టీ పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను అన్నారు. ఐటీ శాఖ కాంగ్రెస్ పార్టీకి నోటీసులు జారీ చేయడాన్ని ఖండిస్తూ శనివారం ప్రత్తిపాడులో నిరసన వ్యక్తం చేశారు.

నేటితో ముగియనున్న వడ్డీ రాయితీ

- ఇప్పటికీ రూ.2.93 కోట్ల పన్ను వసూళ్లు

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం పన్నుపై ఇచ్చిన వడ్డీ రాయితీ ఆదివారంతో ముగుస్తుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. మున్సిపాలిటీలో రూ.4.20 కోట్ల బకాయిలు ఉండగా, శనివారం రాత్రి వరకూ రూ.2.93 కోట్లు వసూలైందని చెప్పారు. రూ.కోటి వరకూ ప్రభుత్వ కార్యాలయాల పన్నుల బకాయిలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించక ముందు వరకూ రూ.1.70 కోట్లు వసూలు కాగా, వడ్డీ రాయితీ ప్రకటించిన తర్వాత రూ.1.23 కోట్లు వసూలైందని వివరించారు. బకాయిదారులు పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలన్నారు. ఆదివారం సెలవు అయినప్పటికీ రాత్రి తొమ్మిది గంటల వరకూ పన్నులు వసూలు చేస్తారని చెప్పారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్



కత్తిపూడిలో రన్ ఫర్ జీసస్ ర్యాలీని ప్రారంభించిన వరుపుల సుబ్బారావు



జగ్గంపేటలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

జగ్గంపేట: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని జగ్గంపేటలో శనివారం రన్‌ఫర్ జీసస్ నిర్వహించారు. రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ ఆధ్వర్యంలో క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ ర్యాలీ చేశారు. స్థానిక టీచర్స్ కాలనీ నుంచి ప్రారంభమైన ర్యాలీ నెహ్రూ కాలనీ, శ్రీరామ్ నగర్, పద్మనాభ నగర్, కొంగల రావి చెట్టు వీధి, కాకినాడ రోడ్డు మీదగా గోకవరం రోడ్డు వరకూ సాగింది. కార్యక్రమంలో పాస్టర్లు సుదర్శన్, విజయరాజు, సువార్త పాల్, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

శంఖవరం: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. క్రైస్తవులు గ్రామంలో ర్యాలీ చేశారు. తొలుత పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఏసుక్రీస్తు జీవితం ఆదర్శనీయమన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు గాబు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

కిర్లంపూడి: అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం అదుపులోకి తీసుకున్నట్టు తహసీల్దార్ బి.అశయ్య తెలిపారు. వివరాల్లోకి వెళితే... వేలంక నుంచి జగపతినగరం వైపు ట్రాక్టర్లపై మట్టి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వేలంక వీఆర్వో ప్రసాద్, ఆర్ఐ సత్యదేవప్రసాద్ దాడి చేసి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ఆయా ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్టు తహసీల్దార్ తెలిపారు. చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో నిబంధనలకు విరుద్ధంగా మట్టి రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్న రెవెన్యూ సిబ్బంది

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

గండేపల్లి: చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని ట్రైనీ ఐపీఎస్ అధికారి నవజ్యోతి మిశ్రా సూచించారు. గండేపల్లి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పోలీసులు విధి నిర్వహణలో తర్ఫీదు పొంది ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గండేపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించినట్టు తెలిపారు. ఆయన వెంట జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు, ఎస్సై ఎన్.రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.



గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి నవజ్యోతి మిశ్రా